క్లుప్తంగా

మార్కెట్ చైర్మన్ పదవి ఇవ్వాలని వేడుకోలు

మక్తల్: మక్తల్ మార్కెట్ చైర్మన్ పదవికి తనకు అవకాశం కల్పించాలని మండల పరిధిలోని కాట్రెవ్‌పల్లికి చెందిన మాజీ సింగిల్ విండో డైరెక్టర్ అనురాధ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో 30 ఏళ్ల నుంచి పనిచేశానని అన్నారు. మార్కెట్ చైర్మన్ పదవికి అవకాశం ఇవ్వాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డిలకు విన్నవించుకున్నామన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి సర్పంచ్‌లను గెలిపించుకున్నామన్నారు. అధికారం ఉన్నా.. లేకున్నా.. పార్టీ కోసం పనిచేశామన్నారు. తనను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గుర్తించి మక్తల్ మార్కెట్ చైర్మన్ పదవి ఇవ్వాలని కోరాను.

'బీజేపీ ఎంపీ అభ్యర్థి గెలుపును అడ్డుకోలేరు'

మరికల్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం ఈ సారి బీజేపీ కైవసం చేసుకుంటుందని మండల ప్రధాన కార్యదర్శి వేణు, నాయకులు రమేష్ అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీ మహబూబ్‌నగర్ టికెట్ ఎవరికి ఇచ్చినా.. పార్టీ గెలుపు కోసం క్షేత్రస్థాయిల్లో కష్టపడి పనిచేసి గెలిపించుకుంటామన్నారు. దేశంలో ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధికి ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. మాయమాటలు చెప్పే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను నమ్మి మోసపోవద్దని పిలుపునిచ్చారు.

పశువులకు టీకాలు

దామరగిద్ద: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు విధిగా వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్‌కుమార్ అన్నారు. మండల పశువైద్యాధికారి ఆధ్వర్యంలో మండలంలోని క్యాతన్‌పల్లిలో చేపట్టిన గాలికుంటు టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పశువుల్లో గాలికుంటు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. తెల్లజాతి పశువులు, గేదెలకు టీకాలు వేశారు.డాక్టర్ సబిత, సిబ్బంది రవికుమార్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ : ఇద్దరికి గాయాలు

మాగనూర్: మండల పరిధిలోని నేరడగం గ్రామ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మక్తల్ పట్టణానికి చెందిన మహ్మద్ తాయర్ తన భార్య గ్రామమైన కర్ణాటక రాష్ట్రం అజిలాపూర్‌కు పని నిమిత్తం వెళ్లి తిరిగి వస్తున్నాడు. నేరడగంకి చెందిన రాజు బహిర్భూమికి వెళ్లి తన ద్విచక్రవాహనంపై వస్తుండగా.. గ్రామ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు అతివేగంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని ప్రథమ చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. ఇద్దరి పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ఇసుక డంపు సీజ్

మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ గ్రామ సమీపంలో అక్రమంగా తరలించిన పదిహేను ట్రాక్టర్ల ఇసుక డంపును గుర్తించి సీజ్ చేసినట్లు తహసీల్దార్ సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వర్కూర్ గ్రామపెద్ద వాగు నుంచి ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా బుధవారం ఇసుక తరలించి గ్రామ సమీపంలో డంపు చేసినట్లు కొందరు గ్రామస్తుల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామంలోని ఇసుక డంపు వద్దకు వెళ్లి పరిశీలించగా.. అక్కడ అనుమతులు లేని ఇసుక ఉన్నట్లు గుర్తించారు. ఇసుక డంపు చుట్టూ ముగ్గు వేసి ఇసుకను సీజ్ చేసినట్లు తెలిపారు. ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని, నిర్మాణానికి ఇసుకను ప్రభుత్వ అనుమతుల ద్వారా మాత్రమే తరలించుకోవాలని సూచించారు. డంపు చేసిన ఇసుకను ప్రభుత్వ పనుల నిమిత్తం వినియోగస్తామని వెల్లడించారు.

ఆర్థిక సాయం అందజేత

మరికల్: మండలంలోని పస్పులకి చెందిన బొక్కిపెద్ద ఎల్లప్ప అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన అంత్యక్రియల నిమిత్తం కాంగ్రెస్ నాయకులు రవికుమార్‌గౌడ్, భానుప్రసాద్‌గౌడ్ బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం ఆర్థిక సాయం చేశారు. గ్రామంలో పేదలకు ఏమైన ఆపద వస్తే తన వంతు సాయం అందించేందుకు ముందుటామని తెలిపారు. కార్యక్రమంలో సిద్దప్ప, లింగప్ప, నర్సింహులు, కొండప్ప, సుధాకర్ పాల్గొన్నారు.

శ్రీశైలానికి బయలుదేరిన శివస్వాములు

మాగనూర్: శివదీక్షకు 41 రోజులు పాటు నియమ నిష్టలతో శివదీక్ష చేపట్టిన ఉజ్జెల్లికి చెందిన శివభక్తులు బుధవారం శ్రీశైలానికి పయణమయ్యారు. అంతకు ముందు గ్రామంలోని శివాలయం వద్ద స్వాములు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి, ఇరుముడులు కట్టి భక్తి సంకీర్తనలు, భజన కార్యక్రమాలను మధ్యాహ్నం యాత్రకు బయలుదేరారు. గ్రామస్తులంతా పూజలతో గ్రామ పొలిమేర వరకు స్వాములను సాగనంపారు. గ్రామం మొత్తం శివనామస్మరణతో మార్మోగింది. గ్రామస్తులు, భక్తులుపాల్గొన్నారు.




దత్తాత్రేయస్వామి ఉత్సవాలు ప్రారంభం

రేపు రథోత్సవం



వల్లభాపురం ఆలయంలో వెలిసిన దత్తాత్రేయస్వామి



వల్లభాపురంలో కృష్ణానది తీరాన వెలిసిన దత్తక్షేత్రం

మక్తల్: మండలంలోని వల్లభాపురం దత్తక్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పవిత్ర కృష్ణానది తీరాన వెలిసిన జగద్గురు దత్తాత్రేయస్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు 6న బుధవారం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 8న శుక్రవారం రథోత్సవం వేడుకలు నిర్వహిస్తామని, దత్త పీఠాధిపతి, నిర్వాహకులు, ట్రస్టు కమిటీ సభ్యులు తెలిపారు. 9న శివపార్వతుల కల్యాణోత్సవం, 12న రేణుక మాత బోనాల ఉత్సవాలు కొనసాగుతాయని చెప్పారు. శ్రీపాదవల్లభాపురం దత్తాత్రేయస్వామి వారు స్వయంగా ఎంచుకున్న పుణ్యక్షేత్రం ఇది. దత్తాత్రేయస్వామి నిత్యం బ్రహ్మ ముహూర్తంగా నదిలో స్నానం ఆచరించి అనుష్టానం చేస్తారని, కర్ణాటకలో సూర్యుని ఆర్యప్రదానం చేస్తారని, మధ్యాహ్నం భిక్ష కొలహాపురంలో స్వీకరించి, కాంచాలపురంలో భుజించి, పండరీపురంలో చంద్రావాహ నది జలంతో ఆ చందనం చేస్తారని, తుంగభద్రానది ప్రార్థన మేరకు సహాద్రి శిఖరంపై కొలువు దీరుతాడని నిర్వాహకులు తెలియజేశారు. శివరాత్రి ఉత్సవాలు మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వల్లభాపుర దత్తక్షేత్రం వద్ద అర్చన, మహానివేదన మంగళ హారతి కార్యక్రమం నిర్వహించారు. రథోత్సవ అనంతరం కృష్ణానది జలసేకరణ, మహారుద్రాభిషేకం, సాయంత్రం 5 గంటలకు రథోత్సవ కార్యక్రమం, సహస్ర దీపాలంకరణ, అభిషేకం ఉంటుందన్నారు. అన్నమయ్య సంకీర్తనలు, రాత్రి 8 గంటలకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 12న రేణుకామాతకు బోనాల ఉత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు ఆలయ చైర్మన్ దత్తు తెలియజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలు జయప్రదం చేయాలని కోరారు. ఉత్సవాల సందర్భంగా మక్తల్ పట్టణం నుంచి ఆలయం వరకు ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నిత్యం భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలియజేశారు.

మహాశివరాత్రికి ఆలయాలు ముస్తాబు



ఆలయంలో వెలిసిన శివలింగం



మక్తల్‌లోని మల్లికార్జునస్వామి దేవాలయం

మక్తల్: పట్టణంలో కొలువుదీరిన మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రతి సంవత్సరం మహాశివరాత్రి గురువారం వైభవంగా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వామివారి ఉత్సవాలు ధ్వజారోహణం, కలశపూజతో ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా కృష్ణానది నుంచి పవిత్ర జలాలు తీసుకొచ్చి స్వామివారికి అభిషేకం నిర్వహిస్తారు. మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా 7న శిఖర కలశరోహణ కార్యక్రమం, 8న తెల్లవారుజామున మల్లికార్జున స్వామివారికి మహారుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి తిప్పయ్య స్వామి తెలియజేశారు. 9న భ్రమరాంభిక కల్యాణోత్సవం కొనసాగుతుందని చెప్పారు. బిల్వార్చన కార్యక్రమం సాయంత్రం 5 గంటలకు స్వామివారి పల్లకీసేవ పురవీధుల వెంట ఊరేగింపుగా వెళ్తారు.

పేట డిపోలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న జిల్లా రవాణా శాఖ అధికారి మేఘా గాంధీ

నారాయణపేట: స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను మహిళా ఉద్యోగులు ఘనంగా జరుపుకొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా రవాణా శాఖ అధికారి మేఘా గాంధీ, డిపో మేనేజర్ లక్ష్మి కేక్ కట్ చేశారు. ఈపీకే సాధించిన మహిళ కండక్టర్లు ముగ్గురికి అభినందన పత్రం అందజేశారు. ప్రతిరోజూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న అన్ని రూట్లలో కలిపి ఐదుగురు మహిళా ప్రయాణికులకు వందనాలు పత్రం అందజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌చార్జ్‌లు అలివేలమ్మ, శ్రీశైలమ్మ, స్టేషన్ మేనేజర్ భీమమ్మ, ఈడబ్ల్యూబీ మెంబర్ సరోజ, మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

ఊట్కూరు: ఊట్కూరులోని సరస్వతీ శిశుమందిర్‌లో బుధవారం ఘనంగా స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులుగా నవతేజ, కలెక్టర్‌గా కస్తూరి, డీఈఓగా మానిష, ఎంఈఓగా ఉదయ్‌కిరణ్, ప్రముఖ మహేందర్ తదితరులుగా విద్యార్థులు వ్యవహరించారు. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయులు భీంరాజు, రిటైర్డ్ ఉపాధ్యాయులు సురేష్, లింగం, రఘువీర్, నర్సింగప్ప, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

మద్దూరు: గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జయరాములు ఉపాధి కూలీలకు సూచించారు. బుధవారం మండలంలోని ఎక్కమేడ్‌లో ఉపాధి ఏపీఓ సిద్ధేశ్వర్‌తో కలిసి ఉపాధి పనులు పరిశీలించారు. వేసవి కాలంలో వ్యవసాయ పనులు లేక పోవడం, మండలాన్ని కరువు మండలంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని గుర్తుచేశారు. ఉపాధి సిబ్బంది సూచించిన విధంగా పనులు చేస్తే సరైన కూలీ వస్తుందని సూచించారు. ఇంకా ఎవ్వరైన ఉపాధి పనులకు రాకుంటే వారికి తెలియజేయాలని కూలీలకు ఎంపీడీఓ సూచించారు.

మహిళా కూలీలకు కుట్టుమిషన్ శిక్షణ



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ రాజేశ్వరి

కృష్ణా: మండలంలోని ఉపాధిహామీ పథకం పనుల్లో 100 రోజులు పూర్తి చేసుకున్న మహిళా కూలీలకు కుట్టుమిషన్ శిక్షణ అందిస్తున్నామని డీఆర్‌డీఓ రాజేశ్వరి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రధానంగా 2018 నుంచి ఉపాధిహామీ పథకం పనుల్లో పాల్గొన్న మహిళా కూలీలకు 45 రోజుల పాటూ కుట్టుమిషన్ శిక్షణ అందించడంతో పాటూ వారికి ధ్రువపత్రాలను అందిస్తామన్నారు. మండలంలో 35 మంది మహిళలు ఈ శిక్షణకు సిద్ధమైతే వారికి మండల కేంద్రంలోని రైతువేదికలోనే శిక్షణ అందిస్తామన్నారు. ఈ శిక్షణ పూర్తిచేసుకున్న వారికి బ్యాంక్‌లోన్ ద్వారా కుట్టుమిషన్లు అందించి, వారికి ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అందించే యూనిఫామ్స్ ఆడర్లు ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని మహిళా కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా ప్రతి గ్రామంలో కూడా ఉపాధి హామీ పనులు చేపట్టాలని, అందుకు గాను ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు ప్రత్యేక కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ జానయ్య, ఏపీఓ చంద్రశేఖర్, ఎంపీఓ రామన్న, అంబుడ్స్‌మ్యాన్ నాగిరెడ్డి, ప్లాంటేషన్ మేనేజర్ రవినాయక్, సీనియర్ అసిస్టెంట్ చక్రపాణి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

మరికల్: వివిధ రంగల్లో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కార్మిక సంఘం నాయకులు శ్రీనివాసులు, ఎల్లప్ప కోరారు. మరికల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కొన్నాళ్ల నుంచి హమాలీ కార్మికులు వంద నుంచి 50 కిలోల బస్తాలను మోయడంతో వారు అనారోగ్యం బారిన పడుతున్నారని గుర్తుచేశారు. అలాగే వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు కూడా ఏదో సమస్యతో బాధపడుతున్నట్లు తెలిపారు. కార్మికులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఏదైన ప్రమాదంలో మృతిచెందితే రూ.10 లక్షల పరిహారం, గాయపడితే రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రామకృష్ణ, వెంకటయ్య, అంజప్ప, రాము, తిమ్మన్న, శేఖర్, ఎల్లప్పలు పాల్గొన్నారు.

పాలమూరు ఎంపీ టికెట్ బీసీలకే కేటాయించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ యాదవ్

కోస్గి: రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే వాడుకుంటున్నాయని, బీసీలంతా ఏకమైతే బీసీలు రాజకీయంగా ఎదుగుతారని బీసీ సేనా రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ యాదవ్ అన్నారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు కనీసం 7 స్థానాలను బీసీలకు కేటాయించాలన్నారు. ముఖ్యంగా పాలమూరు ఎంపీ స్థానాన్ని బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఉన్నత వర్గాలకు కేటాయించి బీసీలను విస్మరించారని, బీజేపీ టికెట్ బీసీ వర్గానికి చెందిన శాంతికుమార్‌కు ఇవ్వాలన్నారు. బీసీలను విస్మరించిన పార్టీలకు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామన్నారు. ఇందులో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ భానుచందర్, నాయకులు నర్సింహులు, రమేష్, రాజు, నవీన్, మహేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నారాయణపేట: విద్యార్థులు తప్పకుండా శుభ్రతను పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్యులు బి.శ్రీనివాసులు సూచించారు. బుధవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్‌లో రాష్ట్రీయ బాలస్వస్థ కార్యక్రమం(మొబిలా హెల్త్ టీం) ఆధ్వర్యంలో ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ బి.శ్రీనివాసులు డాక్టర్ స్వాతి నేతృత్వంలో విద్యార్థులకు రక్తహీనత (హిమోగ్లోబిన్) సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించారు. 130 మంది విద్యార్థులను పరీక్షించి వారిలో రక్తహీనత కలిగినటువంటి విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పౌష్టికాహారంతో పాటు ఆరోగ్య నియమాలు పాటిస్తూ ప్రతి విద్యార్థి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలియజేశారు. డాక్టర్ బి.శ్రీనివాసులు, డాక్టర్ స్వాతి, అబ్దుల్ ముజీప్, అనంతలక్ష్మి, డాక్టర్ శృతి పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నారాయణపేట: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాల్లో ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేస్తామని ప్రకటించిందని.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్ఆర్ఎస్‌కు డబ్బులు కట్టి చేసుకోవాలని చెప్పడం హస్యాస్పదంగా ఉందని.. వెంటనే ఉచితంగా చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గందెచంద్రకాంత్, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, నాయకులు బండి శివరాంరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్ స్కీంలను తీసుకొస్తే అప్పట్లో కాంగ్రెస్ నేతలు ఒక్కొక్కరు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తూ వ్యతిరేకించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌పై చిత్త శుద్ధితో ఉచితంగా చేయాలని కోరారు. లేకుంటే ప్రజాపక్షాన ఉద్యమాలు చేస్తామన్నారు. గురువారం కలెక్టర్‌కు వినతి అందజేస్తామన్నారు. వేపూరి రాములు, సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్

నారాయణపేట: జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయాలని స్థానిక సంస్థల జిల్లా అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎంపీడీఓలు, మిషన్ భగీరథ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీల వారీగా నీటిసరఫరా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో సమస్యలుంటే స్థానిక నీటి వనరులను ఉపయోగించుకోవాలన్నారు. ఈ నెల 15లోపు జిల్లాలో ఎక్కడా తాగునీటి సరఫరాకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

ఎల్లమ్మ జాతరలో కబడ్డీ పోటీలు

దామరగిద్ద: మండలంలోని కట్టమీది ఎల్లమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ సమీపంలో యువకులను కబడ్డీ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్, ఎల్లమ్మ ఆలయ కమిటీ సభ్యులు రాఘవేందర్‌గౌడ్, గోవింత్ క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. జాతర ఉత్సవాల్లో అమ్మవారి జల్దిబిందె బోనాలు ప్రత్యేక ఉత్సవాలతో పాటు రెట్టపట్ల క్రీడ, కబడ్డీ నిర్వహించడం ఎంతో సంతోషనీయమని క్రీడాకారులు, ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సత్తి గోవింద్, అంజప్ప, దస్తగిరి, మొగులప్ప పాల్గొన్నారు.

బీజేపీతోనే మహిళా సాధికారత సాధ్యం

రాష్ట్ర నేత రతంగపాండురెడ్డి



పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర నేత రతంగపాండురెడ్డి

నారాయణపేట: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ద్వారానే దేశంలో మహిళా సాధికారత సాధ్యమని బీజేపీ రాష్ట్ర నేత రతంగపాండురెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శీలా గార్డెన్‌లో ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ ప్రసంగాన్ని బీజేపీ నేత రతంగపాండురెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాసులు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి పూజా కార్యక్రమం నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళల సాధికారిత కోసం, ఆర్థికంగా ఎదగడం కోసం అనేక పథకాలు ప్రధాని నరేంద్రమోదీ అమలు చేశారన్నారు. దశాబ్దాల కాలంగా గత ప్రభుత్వాలు అణచిపెట్టిన మహిళా బిల్లు తీసుకొచ్చి మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్న ఘనత ప్రధాని నరేంద్రమోదీదేనన్నారు. ట్రిబుల్ తలాక్‌ను రద్దు చేసి ముస్లిం మహిళలకు స్వేచ్ఛా కల్పించారన్నారు. ముద్రయోజనలో 68 శాతం రుణాలు ఇచ్చి ఉపాధి కల్పించారన్నారు. అంతే కాకుండా మహిళల కష్టాలు తీరుస్తానని, మహిళలకు వడ్డీలేని రుణాలు, ఉజ్వల పథకంతో ఉచిత గ్యాస్ కనెక్షన్లు లక్షలాదిగా ఇచ్చారన్నారు. సుకన్య సమృద్ధి యోజన మహిళలకు ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. అలాంటి ప్రభుత్వం మరో సారి ఏర్పాటు చేసేందుకు మహిళలంతా ప్రధాని నరేంద్రమోదీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామయ్యగౌడ్, పట్టణ అధ్యక్షుడు మిర్చి వెంకటయ్య, కౌన్సిలర్లు ప్రమీల, అనూష, జయశ్రీ, మాజీ కౌన్సిలర్లు భారతమ్మ, సూర్యకల, బీజేపీ నాయకులు నక్క సత్యనారాయ, బాల్‌రెడ్డి, నాగిరెడ్డి, ప్రకాష్ పాల్గొన్నారు.

ఉత్తమ విద్య అందించేందుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్‌జీ ఈడీ మధుసూదన్ రెడ్డి



మాగనూర్ సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి వెంకటయ్య

మాగనూర్: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు ఉత్తమ విద్య అందించేందుకు ప్రతినిత్యం కృషి చేయాలని మండల నోడల్ అధికారి వెంకటయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాగనూర్‌లో నిర్వహించిన కాంప్లెక్స్ మీటింగ్‌లో ఆయన పాల్గొని ఉపాధాయులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఉపాధ్యాయుడు 30 రోజుల ప్రణాళిక తయారు చేసుకొని ఈ విద్యాసంవత్సరాన్ని అందరు విద్యార్థులకు నాణ్యమైన విద్యఅందించి, విజయంతమైన విద్యాసంవత్సరంగా ముగించాలని సూచించారు. రెండో రోజు నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో హాజరైన ఉపాధ్యాయులతో 30 రోజుల ప్రణాళిక తయారు చేయించారు. కాంప్లెక్స్ హెచ్ఎం నర్సింహులు, జిల్లా రిసోర్స్ పర్సన్ నరేందర్, ఉపాధ్యాయులు రాములు, స్వప్న, విశాలాక్షి, ఎల్లాగౌడ్, కృష్ణ, వంశీ కృష్ణ, చంద్రశేఖర్, రాజు పాల్గొన్నారు.

అభ్యాసన లోపాలు లేకుండా ముందు తరగతికి చేరాలి

కోస్గి: ఈ విద్యాసంవత్సరం చివరి వరకు ప్రతి విద్యార్థి ఎలాంటి అభ్యాసన లోపాలు లేకుండా ప్రగతి సాధించి రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులు అభ్యాసన లోపాలు లేకుండా ముందు తరగతికి చేరేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎస్ఆర్‌జీ ఈడీ మధుసూదన్ రెడ్డి సూచించారు. ఈ మేరకు బుధవారం 30 రోజుల ప్రణాళిక ముఖ్య ఉద్దేశం అనే అంశంపై కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. కార్యక్రమం అమలులో భాగంగా ఉపాధ్యాయులు తాము బోధించే తరగతిలో తెలుగు, గణితం, ఆంగ్లం సబ్జెక్టుల్లో విద్యార్థుల స్థాయిని గుర్తించి ఏ, బీ, సీ గ్రూపులుగా గుర్తించాలన్నారు. ప్రతిరోజూ మొదటి 45 నిమిషాలు రెగ్యులర్ పాఠ్యంశాలు బోధించి, రెండో 45 నిమిషాలు ఏ, బీ గ్రూప్ విద్యార్థులకు వర్క్ బుక్ కృత్యాలను చేయించాలన్నారు. 30 రోజులు ఒక ప్రణాళిక ప్రకారం బోధించి విద్యార్థులను ఎస్ఏ–2 పరీక్షలు రాయడానికి సన్నద్ధం చేయాలన్నారు.

30 రోజుల కార్యాచరణకు ప్రణాళిక సిద్ధం

ఊట్కూరు: 30 రోజుల కార్యాచరణకు పాఠశాలలో ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంఈఓ వెంకటయ్య అన్నారు. బుధవారం ఊట్కూరు కాంప్లెక్స్ సమావేశం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి తరగతిలో విద్యార్థుల స్థాయికి అనుగుణంగా ఏబీసీ గ్రేడ్లు విభజించాలని, ప్రతి విద్యార్థి ఏ గ్రేడ్‌లో వచ్చేందుకు 30 రోజుల కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ప్రత్యేక అధికారి

మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో బుధవారం సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఎన్ఆర్‌జీఎస్ కింద మంజూరైన నిధులతో గ్రామంలో సీసీరోడ్లు లేని కాలనీలను గుర్తించి సీసీరోడ్డు పనులు చేయిస్తామని గ్రామ ప్రత్యేక అధికారి ఉదయ్ తెలిపారు. పనులు దక్కించుకున్న వారు నాణ్యతతో చేయాలని సూచించారు. దశల వారీగా గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరన్న, కృష్ణయ్య, సూర్యమోహన్, అంజిరెడ్డి, హరీష్, మాసన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదీవెన సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు



ప్రజాదీవెన బహిరంగ సభకు వెళ్తున్న వాహనాన్ని ప్రారంభిస్తున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: పాలమూరు జిల్లా కేంద్రం ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో బుధవారం నిర్వహించిన ప్రజాదీవెన బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మక్తల్ నియోజవర్గం నుంచి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో 450 వాహనాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు తరలివెళ్లారు. మక్తల్, మాగనూర్, కృష్ణ, ఊట్కూర్, నర్వ, అమరచింత, ఆత్మకూర్ మండలాల్లో నుంచి వాహనాల్లో కాంగ్రెస్ శ్రేణులు వెళ్లారు. మక్తల్ మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, బీకేఆర్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, గణేష్ కుమార్, రవికుమార్ యాదవ్, ఆనంద్‌గౌడ్, విఘ్నేశ్వర్ రెడ్డి, కోళ్ల వెంకటేష్, మరి కొందరు కార్యకర్తలు తరలివెళ్లారు.

మాగనూర్: మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పాలమూరు అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డిని ఎంపీగా గెలిపించుకుంటామని అన్నారు. కేంద్రంలో బీజేపీ నిరంకుశ పాలన నుంచి కాంగ్రెస్ పార్టీ ద్వారా మాత్రమే విముక్తి లభిస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల కష్టాలు మరింత పెరిగాయని అన్నారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సింహ, రాము, కృష్ణయ్య, మొగులప్ప పాల్గొన్నారు.

మరికల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యే ప్రజాదీవెన సభకు బుధవారం మరికల్ మండలం నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లారు. కాంగ్రెస్ నాయకులు వీరన్న, సూర్యమోహన్, హరీష్, రామకృష్ణ, అంజనేయులు, శేఖర్ పాల్గొన్నారు.